

మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



## రెగ్యూలర్ చేయాలి..

ఎదులాపురం, డిసెంబర్ 23 : వైద్య, ఆరోగ్య శాఖలో 23 ఏండ్ల నుంచి పని చేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను షరతులు లేకుండా రెగ్యూలర్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్ అన్నారు. సోమవారం ఏఎన్ఎంలతో కలిసి కలెక్టరేట్ ఎదుట సమస్యల పరిష్కారానికి ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.



ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఎన్ఎంలు

## ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం..

ఉట్నూర్, డిసెంబర్ 23 : సీఆర్టీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఖానాపూర్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్‌లు అన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం ఎదుట సీఆర్టీలు నిర్వహిస్తున్న రిలే దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై గళమెత్తుతున్న తమకు ప్రభుత్వం అసెంబ్లీలో కనీసం మైకు కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. సీఆర్టీల విషయాన్ని అసెంబ్లీలో ప్రశ్నిస్తానని స్పీకర్‌ను అడిగిన మైకు ఇవ్వకపోవడంతో హరీశ్‌రావు పక్కన కూర్చొని చీటిపై రాసిచ్చానన్నారు. చెట్లు, గుట్టలు, వాగులు దాటి గిరిజనులకు విద్యనందిస్తున్న సీఆర్టీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలన్నారు. సీఆర్టీల సమస్యలను పరిష్కరించే వరకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. సీఆర్టీల సమ్మెకు మద్దతుగా రూ.51 వేల నగదును అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చారులత, మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, నాయకులు భరత్ చౌహన్, పుష్పరాణి, శ్రీరాంనాయక్, సింగారే భరత్, అజయ్, సోనేరావు, తిరుమల గౌడ్ పాల్గొన్నారు.



భిక్షాటన చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

## భిక్షాటన చేసి.. నిరసన తెలిపి..

దస్తురాబాద్, డిసెంబర్ 23 : తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె చేస్తున్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సమ్మె సోమవారం నాటికి రెండో రోజుకు చేరుకున్నది. సమ్మెలో భాగంగా భిక్షాటన చేసి తమ నిరసన తెలిపారు. జీతాలు, బిల్లులను చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

## విద్యుత్ సౌకర్యం లేని గ్రామాలకు త్రీఫేజ్ కరెంట్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

### ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, డిసెంబర్ 23 : విద్యుత్ సౌకర్యం లేని గ్రామాలకు త్రీఫేజ్ కరెంట్ ఇస్తామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. అటవీ, విద్యుత్ శాఖ అధికారులతో కలెక్టర్ రాజర్షి షా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యుత్ సౌకర్యం లేని భీంపూర్, ఎస్టీ అవాసాలు, నేరడిగొండ వంటి గ్రామాల్లో జాయింట్ సర్వే నిర్వహించి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్ పాల్గొన్నారు.

### మున్సిపల్ అధికారులతో సమావేశం

కలెక్టర్ రాజర్షి షా తన చాంబర్‌లో మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ఎస్టీపీ నిర్మించుటకు త్వరగతిన స్థలం సేకరించి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వినోద్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రాజు పాల్గొన్నారు.



సీఆర్‌టీల సమ్మె నేపథ్యంలో తాళం వేసి ఉన్న నిర్మల్ జిల్లా కడెం గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల

# సమ్మెలో సీఆర్టీలు.. బడులకు తాళం

**డిమాండ్లు నెరవేర్చాలంటూ సమ్మెబాట పట్టిన కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్**

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మూతపడిన 654 ఏకోపాధ్యాయ పాఠశాలలు
- సమీపిస్తున్న పదో తరగతి పరీక్షలు..కొనసాగని తరగతులు
- ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం
- విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకం
- వారమవుతున్నా స్పందించని సర్కారు

మంచిర్యాల, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : గిరిబిడ్డలకు విద్య అందని ద్రాక్షగా మారింది. ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్(సీఆర్‌టీలు) 8 రోజులుగా సమ్మె చేస్తుండగా, చదువులు సాగక విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతున్నది. పరీక్షలు సమీపిస్తున్న వేళ తరగతుల నిర్వహణకు బ్రేక్ పడడంతో పాస్ అవుతామో లేదోనన్న బెంగ పట్టుకున్నది.

### ఉమ్మడి జిల్లాలోని 654 పాఠశాలల్లో..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 654 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో దాదాపు 48 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. సమస్యల పరిష్కారం కోసం సీఆర్టీలు సమ్మెకు దిగడంతో తరగతులు కొనసాగడం లేదు. ఈ పాఠశాలలన్నీ తాళం వేసి ఉంటుండగా, స్కూల్‌కు వచ్చిన గిరిజన విద్యార్థులు ఉపాధ్యాయుల కోసం ఎదురుచూసి వెనుతిరిగిపోతున్నారు. కొన్ని స్కూళ్లలో పిల్లలు కాసేపు ఆడుకొని ఇంటికి వెళ్లిపోతున్నారు.

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మూతబడ్డ ఏకోపాధ్యాయ పాఠశాలల వివరాలు**

| జిల్లా | ఏకోపాధ్యాయ పాఠశాలలు |
|---|---|
| ఆసిఫాబాద్ | 284 |
| నిర్మల్ | 180 |
| ఆదిలాబాద్ | 165 |
| మంచిర్యాల | 25 |
| మొత్తం | 654 |

### పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకం..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయులు సమ్మెబాట పట్టగా, ప్రస్తుతం ఒక్కో పాఠశాలలో ఒకరిద్దరు ఉపాధ్యాయులే పాఠాలు బోధిస్తున్నారు. అన్ని సబ్జెక్టులు బోధించే సిబ్బంది విధులకు హాజరుకాక ఉన్న రెగ్యులర్ ఉపాధ్యాయులు నానా తంటాలు పడాల్సి వస్తున్నది. పిల్లలందరినీ ఒకేదగ్గర చేర్చి చదివించడం తప్ప ఏం చేయలేకపోతున్నారు. మా సబ్జెక్ట్ అంటే చెబుతాం కానీ.. అన్ని సబ్జెక్టులు బోధించడమెలాగని పేర్కొంటున్నారు. పదో తరగతి పరీక్షల్లో ఆశ్రమ పాఠశాలలు కొన్నేళ్లుగా మంచి ఫలితాలు సాధిస్తున్నాయి. ఇక్కడ చదివిన విద్యార్థులకు మంచి గ్రేడ్‌లు వస్తున్నాయి. ఉత్తీర్ణత శాతంలోనూ ప్రైవేట్ స్కూళ్లకు ధీటుగా గిరిజన పాఠశాలలు సత్తా చాటుతున్నాయి. ఇప్పుడు పదో తరగతితో పాటు మిగతా పరీక్షలు దగ్గర పడుతున్నాయి. ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సీఆర్టీల సమ్మెతో గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఆయా పాఠశాలలు దాదాపు 70 శాతం నుంచి 80 శాతం సీఆర్టీలపైనే ఆధారపడి నడుస్తున్నాయి. రెగ్యులర్ ఉపాధ్యాయులు 20శాతం కూడా లేరు. ఈ నేపథ్యంలో సీఆర్టీల సమ్మెతో పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. చదవలేని పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన సమయంలో టీచర్లు సమ్మెలో ఉండడం ఫలితాలపై ప్రభావం చూపనున్నది. అలాగే ఆసిఫాబాద్ జిల్లాలో 46 గిరిజన ఉన్నత పాఠశాలలుండగా, 13 పాఠశాలల్లో ఒకరిద్దరు రెగ్యులర్ ఉపాధ్యాయులే విధుల్లో ఉన్నారు. మిగిలిన వారంతా సమ్మెలో ఉన్నారు. నిర్మల్ జిల్లాలో 11 పాఠశాలలు, మంచిర్యాలలో 16 పాఠశాలలు, ఆదిలాబాద్‌లోని కొన్ని స్కూళ్లలోనూ ఇదే దుస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో పదో తరగతి విద్యార్థులతో పాటు మిగిలిన విద్యార్థులపైనా తీవ్రమైన ప్రభావం పడుతున్నది.

### సమ్మెకు ఎనిమిది రోజులు.. స్పందించని సర్కారు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించి ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలో పని చేసే సీఆర్టీలు సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 16వ తేదీ నుంచి ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ముందు సమ్మె చేస్తున్నారు. దాదాపు ఎనిమిది రోజులుగా టీచర్లు సమ్మెలో ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు, ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. అధికారంలోకి రాకముందు మా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు ఏ ఒక్కరూ ఇప్పుడు పట్టించుకోవడం లేదని సీఆర్టీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో 12 మంది గిరిజన ఎమ్మెల్యేలుంటే ఏ ఒక్కరూ అసెంబ్లీలో మా సమ్మె గురించి ప్రస్తావించడం లేదని వాపోతున్నారు. బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి హరీశ్‌రావు మా సమస్యను ప్రస్తావించారని.. దానిపై ప్రభుత్వ పెద్దలు అసలు స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని లేనిపక్షంలో ప్రత్యేక కార్యాచరణ ప్రకటించి సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.



ఉపాధ్యాయులు రాకపోవడంతో కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలం పిట్టగూడ పాఠశాల ఎదుట ఆడుకుంటున్న విద్యార్థులు

### సీఆర్టీల ముఖ్యమైన డిమాండ్‌లు

- గిరిజన ఆశ్రమ పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న సీఆర్టీలకు మినిమం టైమ్ స్కేల్, ఉద్యోగ భద్రత కల్పించాలి.
- సీఆర్టీల సర్వీసులను క్రమబద్ధీకరించాలి.
- ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలి.
- మహిళా సీఆర్టీలకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు ఇవ్వాలి.
- ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోయిన సీఆర్టీలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.
- పీఎఫ్ సౌకర్యం కల్పించడంతో పాటు 61 ఏళ్లు నిండిన వారికి రూ.20 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలి.
- సీఆర్టీలందరికీ హెల్త్‌కార్డు సౌకర్యం కల్పించాలి.
- ఇతర శాఖల్లోని స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీలకు, ఉపాధ్యాయులకు ఇస్తున్న వేతనమే గిరిజన సంక్షేమ శాఖలో పని చేస్తున్న సీఆర్టీలకూ ఇవ్వాలి.

### ప్రభుత్వం దిగిరాకుంటే ఆమరణ దీక్ష

*రాష్ట్రవ్యాప్తంగా రెండు వేల మంది సీఆర్టీలు ఈ నెల 16 నుంచి సమ్మెలో ఉన్నారు. 8 రోజులవుతున్నా అధికారులు స్పందించడం లేదు. అన్ని డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ టీచర్లను రెగ్యులరైజ్ చేశారు. మా డిపార్ట్‌మెంట్‌లో ఎందుకు చేయడం లేదని అడుగుతున్నాం. రాష్ట్రంలో రెండు వేల మంది ఉంటే.. ఒక్క ఆదిలాబాద్ జిల్లాలోనే 1200 మంది సీఆర్టీలు ఉన్నారు. మాకు న్యాయం చేయాలి. మా డిమాండ్‌లను పరిగణలోకి తీసుకొని పరిష్కారం చూపాలి. గవర్నమెంట్ చర్చలకు రాకపోతే ఆమరణ నిరాహార దీక్షకు సైతం పూనుకుంటాం.*



**- జాదవ్ వినంత్‌రావు, సీఆర్టీ, రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు**



## ఒంటి కాలుపై నిలబడి నిరసన

ఒంటి కాలుపై నిలబడి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

*సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ న్యాయమైన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె కొనసాగుతోంది. సమ్మెలో భాగంగా నిర్మల్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సమ్మె సోమవారం నాటికి 14వ రోజుకు చేరుకుంది. నిరసనలో భాగంగా జాతీయ రహదారిపై ఒంటికాలుపై నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు.*

*- నిర్మల్ అర్బన్, డిసెంబర్ 23*

## సమస్యలను పరిష్కరించాలి

**నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్**



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 23 : ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా దరఖాస్తులను స్వీకరించారు. రుణమాఫీ, విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, వ్యవసాయం పింఛన్లు, భూ సమస్యలు, డబుల్ బెడ్రూం వంటి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వేను వేగవంతం చేయాలన్నారు. వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు మూడు పూటల కామన్ డైట్ విధానాన్ని పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్ కుమార్ పాల్గొన్నారు.

### రుణమాఫీ చేయాల్సిందే..

కాంగ్రెస్ సర్కారు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చేయలేదని నిర్మల్ రూరల్ మండలంలోని అనంతపేటకు చెందిన రైతులు సోమవారం కలెక్టర్ కార్యాలయానికి వచ్చారు. ఇటీవల మాఫీ చేసిన జాబితాలో తమకు మాఫీ కాలేదని రైతులు పేర్కొన్నారు. అధికారుల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం చేకూరలేదన్నారు. రుణమాఫీ కాక కొత్త రుణం తీసుకోక చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదనఆవేదన చెందుతున్నారు. ఈ సందర్భంగా రైతులు కార్యాలయానికి వచ్చి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం స్పందించి రుణమాఫీ చేయాలని కోరారు.



ప్రజావాణికి తరలివచ్చిన అనంతపేట రైతులు



కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న బావాపూర్ (కె) రైతులు

### ఏడాదవుతున్న మాఫీ కాలే..

రూ.2 లక్షల రుణం మాఫీ కాలేదని ఖానాపూర్ మండలంలోని బావాపూర్(కె) గ్రామానికి చెందిన రైతులు కలెక్టర్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కారు యేడాది అవుతున్నా రుణమాఫీ చేయలేదని వాపోయారు. ప్రభుత్వం వెంటనే రుణమాఫీ చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.



గుడ్ల ధరలను పెంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినతి పత్రం ఇచ్చి వస్తున్న పంపిణీదారులు

### గుడ్ల ధరలు పెంచాలి..

ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లకు సరఫరా చేసే కోడిగుడ్ల ధరలను ప్రభుత్వం పెంచేలా చర్యలు తీసుకోవాలని పంపిణీదారులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జూన్‌లో నిర్వహించిన టెండర్‌లు రూ.5 ఒకటి చొప్పున నిర్ణయించడం జరిగిందని, ప్రస్తుతం గుడ్డు ధర రూ.7 ఉందన్నారు. ప్రభుత్వం ఇటీవల సంక్షేమ హాస్టళ్లలో అమలు చేస్తున్న మెనూ ప్రకారం వారానికి ఆరు రోజులు గుడ్లను సరఫరా చేయడం వల్ల తాము నష్టపోతున్నామన్నారు.

## వినతులు.. ధర్నాలు..

- సమస్యలు పరిష్కరించాలంటూ ఆందోళన
- ప్రజావాణికి తరలివచ్చిన జనం



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్, డిసెంబర్ 23(నమస్తే తెలంగాణ) : తమ సమస్యలను పరిష్కరించాలంటూ సోమవారం ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉద్యోగ, రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించగా, ప్రజావాణికి భారీగా ప్రజలు తరలివచ్చారు. వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రెగ్యూలర్ చేయాలని, రాత పరీక్ష విధానాన్ని రద్దు చేయాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. 23 ఏండ్లుగా తాము కాంట్రాక్ట్ విధానంలో సేవలు అందిస్తున్నామని, కరోనా సమయంలో పని చేశామన్నారు. ఉద్యోగులు కలెక్టర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. సమస్యల పరిష్కారానికి ఢిల్లీలో ఆందోళనలు చేస్తున్న రైతులపై లాఠీచార్జీ, బాష్పవాయువు ప్రయోగాన్ని నిరసిస్తూ వామపక్షాల రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు.

### ప్రజావాణిలో 104 వినతులు

వివిధ ప్రాంతాల నుంచి తమ సమస్యలను పరిష్కరించాలంటూ కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో దరఖాస్తులు అందజేశారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్ రాజర్షి షా పరిష్కారానికి అధికారులకు సూచనలు చేశారు.



### రోడ్డు సౌకర్యం కల్పించాలి

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అసోదాబుర్కి, బొప్పాపూర్, పొన్నగూడ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆ గ్రామస్తులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వర్షాకాలం తాము బురదలో నడవలేకపోతున్నామని, వ్యవసాయ పనులకు పోలేకపోతున్నామని, జ్వరాలు వస్తే చికిత్సలు చేయించుకోవడం కష్టంగా ఉందన్నారు. జిల్లా కేంద్రానికి రావాలంటే ఇంద్రవెల్లి మండలంలోని మూత్నూర్ నుంచి రావాల్సి వస్తుందన్నారు. మూడు గ్రామాలకు కలిపి రెండు కిలోమీటర్ల రోడ్డు నిర్మించాల్సి ఉంటుందని సూచించారు.